ప్రాజెక్టులు ఇవ్వకుంటే.. లేఖ ఎందుకు?

మొదటిపేజీ తరువాయి...

నిర్వహించారు. ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరైన కేటీఆర్ మాట్లాడుతూ రేవంత్ తీరు, కాంగ్రెస్, బీజేపీల దుర్నీతిని ఎండగట్టారు.

పార్లమెంటులో బీఆర్ఎస్ బలంగా ఉంటేనే..

తెలంగాణ ప్రయోజనాలను కాపాడాలంటే పార్లమెంట్‌లో బీఆర్ఎస్ పార్టీ బలంగా ఉండాలని కేటీఆర్ అన్నారు. 'ఏప్రిల్, మే నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు వస్తాయి. దేశంలో మోదీ హవా లేదు.. మన్నూ లేదు. అంతా ఉత్తదే.. బోగస్ ముచ్చట. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇస్తామని చెప్పి మోదీ మాటతప్పిండు. కర్ణాటకలో అప్పర్ భద్రకు జాతీయ హోదా ఇచ్చిండ్రు. కృష్ణా ప్రాజెక్టులను నరేంద్రమోదీకి తాకట్టు పెట్టి, కేఆర్ఎంబీకి అప్పజెప్పి మన జుట్టును ఢిల్లీ చేతిలో పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వం. శ్రీశైలంలో కరెంట్ ఉత్పత్తి చేయనీకె వీలులేదు. చుక్కనీరు తీసుకోవాలన్నా అనుమతి కావాల్సిందే. మెడమీద కత్తి పెట్టినా ప్రాజెక్టులు కేసీఆర్ ఇయ్యలేదు. పాలమూరు బిడ్డగా చెప్పుకుంటున్న రేవంత్ మాత్రం శ్రీశైలం, నాగార్జునసాగర్, జూరాల ప్రాజెక్టులను ఢిల్లీ చేతుల్లో పెట్టిండు. ఈ అంశంపై నల్లగొండలో కేసీఆర్ మీటింగ్ పెడితే వెంటనే అసెంబ్లీలో తీర్మానం చేసి బుకాయించే ప్రయత్నం చేస్తున్నారు. ఎండాకాలంలో తాగునీటి విడుదల కోసం కేఆర్ఎంబీకి ఉత్తరం రాయాలని చీఫ్ సెక్రటరీకి, ఇరిగేషన్ అధికారులకు సీఎం రేవంత్ చెప్పిండు. ప్రాజెక్టులను అప్పగించకుంటే, అవి ప్రభుత్వం చేతిలోనే ఉంటే నీళ్ల కోసం లేఖ ఎందుకు రాయాలి? అసెంబ్లీలో చెప్పింది నిజమా? మంచినీళ్ల కోసం కేఆర్ఎంబీకి లేఖరాయడం నిజమా? అని ప్రశ్నించారు.

రేవంత్ దగుల్బాజీ సీఎం

కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పగించి కాంగ్రెస్ కృష్ణాను తాకట్టుపెడితే, పాలమూరుకు జాతీయ హోదా ఇవ్వకుండా బీజేపీ దగా చేసిందని కేటీఆర్ దుయ్యబట్టారు. 'బాధతో చెప్తున్నా.. రేవంత్ దగుల్బాజీ ముఖ్యమంత్రి. ఎన్నికలకు ముందు ప్రియాంకగాంధీ సమక్షంలో యూత్ డిక్లరేషన్‌లో యువతకు నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీ ఏమైంది? నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పలేదని ఉప ముఖ్యమంత్రి భట్టి అసెంబ్లీలో ప్రకటించారు. ఇందులో ఎవరివి ఝూటా మాటలు? నిరుద్యోగ భృతి ఇస్తారో.. ఇవ్వరో ప్రియాంకగాంధీ సభలోపు చెప్పాలి. కాంగ్రెస్ అబద్ధాలను ప్రజలకు వివరించేందుకు ఇంటింటికీ పుస్తకాలు పంచుతాం. ఎన్నికల్లో మోసం చేసేటోళ్లనే ప్రజలు నమ్ముతరని నాడు అన్నారు. ఆ మాటలను మనం సరిగ్గా ప్రజలకు వివరించలేకపోయాం. అందుకే పచ్చి మోసగాడు ముఖ్యమంత్రి అయ్యిండు. లగ్గమే కాకుండా పిల్ల ఎలా పుడుతుంది? నోటిఫికేషన్ ఇయ్యకుండా ఉద్యోగాలు ఎలా ఇచ్చినట్టు? బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన 30 వేల ఉద్యోగాలకు ఇప్పుడు లెటర్లు ఇచ్చి తానే ఉద్యోగాలు ఇచ్చానని రేవంత్ చెప్పుకోవడం సిగ్గుచేటు. ప్రజలను పిచ్చోళ్లు అనుకుంటున్నారా? రేవంత్ అపాయింట్‌మెంట్లు ఇచ్చిన 30 వేల ఉద్యోగాలు బీఆర్ఎస్ ఖాతాలోకే వెళ్తాయి. ఒక్క నోటిఫికేషన్ కూడా రేవంత్ ఇయ్యలేదు' అని కేటీఆర్ స్పష్టంచేశారు.

కరెంట్ కట్

కేటీఆర్ సభలో మాట్లాడుతుండగా కరెంట్ పోయింది. దీంతో కార్యకర్తలంతా ఒక్కసారిగా ఘొల్లుమని నవ్వారు. కరెంట్ వచ్చాక కేటీఆర్ మాట్లాడుతూ.. మార్పు బాగుందా? అని నవ్వుతూ ప్రసంగాన్ని కొనసాగించారు.

లంకెబిందెలకు ఎవరొస్తారు?

లంకెబిందెల కోసం ఎవరు తిరుగుతారో ప్రజలకు తెలుసని సీఎం రేవంత్‌ను ఉద్దేశించి కేటీఆర్ ఎద్దేవా చేశారు. 'రేవంత్ సీఎంగా అయ్యాక సెక్రటేరియట్‌కు వచ్చి లంకె బిందెలు ఉంటాయనుకుంటే ఖాళీ బిందెలున్నాయని అన్నారు. లంకె బిందెల కోసం ఎవ్వరు తిరుగుతరో చెప్పాలి. రేవంత్ కుటుంబ సభ్యులు ఏంచేసేవారో ఇక్కడివాళ్లకే ఎక్కువ తెలుసు. గడ్డపారలు, తట్టపారలు నెత్తిమీద పెట్టుకొని, దుప్పట్లు కప్పుకొని రాత్రిపూట పాడుబడ్డ కోటల్లో, పాత గడీల్లో, పాత దేవాలయాల్లో దొంగలు తిరుగుతుంటరు. రేవంత్‌కు పాత బుద్ధులు గుర్తొస్తున్నయ్. భవిష్యత్తులో ఎంతోమంది ముఖ్యమంత్రులు వస్తరు, పోతరు. కానీ తెలంగాణ తెచ్చిన ముఖ్యమంత్రిగా కేసీఆర్ చిరకాలం ఉంటారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలని తెలంగాణ తల్లి విగ్రహాన్ని మారుస్తున్నరు. వడ్డాణాలు తెలంగాణలో పెట్టుకోరని, అవి రాచరిక ఆనవాళ్లని రేవంత్ అన్నారు. మరి ఆయన కుటుంబీకులు ఎందుకు వడ్డాణాలు పెట్టుకుంటారు? అందెశ్రీ గేయం వినని, తెలంగాణ గీతంలో అర్థం తెలియని ముఖ్యమంత్రి, మంత్రులు ఇప్పుడు ఉన్నారు. రాష్ట్రంలో ఇప్పుడు పది జిల్లాలు లేవు. ఆ పాటలో రాష్ట్ర అధికారిక ముద్రలుగా కాకతీయ కళాతోరణం, చార్మినార్ ఉన్నాయి' అని కేటీఆర్ వివరించారు.

తెలంగాణ ఉన్నంతవరకు కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయలేరు

కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిగా నీటిలో కొట్టుకుపోయేలా చేసే కుట్ర జరుగుతున్నదని కేటీఆర్ అనుమానం వ్యక్తంచేశారు. 'ఇప్పుడు ఊరూరా కరెంట్ పోతున్నది. అసెంబ్లీలోనూ స్పీకర్ జనరేటర్లు పెట్టించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మూడు పిల్లర్లు నిర్మాణ లోపంతో కుంగితే నికృష్ట మాటలు మాట్లాడుతున్నారు. ప్రాజెక్టు కొట్టుకుపోవాలన్న దురుద్దేశపూరిత ఆలోచనలు కాంగ్రెస్‌కు ఉన్నాయి. దేశంలో కాంగ్రెస్ పరిస్థితి ఘోరంగా ఉన్నది. పార్లమెంట్ ఎన్నికల్లో 39 సీట్లు కూడా ఆ పార్టీకి వచ్చే పరిస్థితి లేదు. రేవంత్, ఉత్తమ్, కోమటిరెడ్డి ఏనాడూ తెలంగాణ కోసం మాట్లాడలేదు. తెలంగాణ ప్రయోజనాలు గులాబీ జెండానే కాపాడుతుంది. పార్లమెంట్‌లో గళం విప్పాలంటే, చెడుగుడు ఆడాలంటే, తెలంగాణకోసం కొట్లాడాలంటే గులాబీ దండుకే దమ్మున్నది. తెలంగాణ కోసం గల్లా పట్టి అడగాలంటే బీఆర్ఎస్ పార్లమెంట్‌లో ఉండాల్సిందే. తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామని రేవంత్ అంటున్నారు. తెలంగాణ లేకుండా చేస్తేనే ఇది సాధ్యమవుతుంది. రాష్ట్రం ఉన్నంత కాలం తెలంగాణ నుంచి కేసీఆర్‌ను తొలగించలేరు' అని తేల్చిచెప్పారు.

కరెంటు బిల్లులు ఎవరికి పంపాలి?

అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ అందరికీ అన్నీ ఫ్రీ అన్నదని, ఇప్పుడు కొత్త సన్నాయి నొక్కులు నొక్కుతున్నదని కేటీఆర్ మండిపడ్డారు. 'కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలకు పెట్టిన వంద రోజుల గడువు మార్చి 9 కూడా దగ్గర పడుతున్నది. హామీల అమలు గురించి అడిగితే ప్రభుత్వంలో ఉన్నవాళ్లకు రోషం పొడుచుకొస్తున్నది. అడ్డం పొడుగు మాట్లాడుతున్నారు. 200 యూనిట్ల కరెంట్ ఫ్రీ అన్నారు. సోనియమ్మ కరెంటు బిల్లు కడుతుందన్న రేవంత్... ఇప్పుడు ఆ బిల్లులు ఎవరికి పంపాలో చెప్పాలి. ఇది అడిగితే బేబేబే...మేమేమే అంటున్నారు. ఇప్పుడు మార్పు బాగున్నదా? తెలంగాణ నుంచి బీఆర్ఎస్‌ను విడదీసే శక్తి ఎవరికీ లేదు. తీస్మార్‌ఖాన్లే ఏమీ చేయలేకపోయారు. ఈ బుడ్డర్ ఖాన్‌తో ఏమీకాదు. ఓట్లు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్, బీజేపీకి లేవు. ఆ రెండు జాతీయ పార్టీలు తెలంగాణకు ద్రోహం చేశాయి. రాజకీయాల్లో గెలుపు, ఓటములు సహజం. నాయకులు, కార్యకర్తలు కుంగిపోవద్దు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ప్రజలపై, జర్నలిస్టులపై కేసులు పెడుతున్నారు' అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

లాస్య కుటుంబానికి బీఆర్ఎస్ అండ

దివంగత ఎమ్మెల్యే లాస్య నందిత కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం పరామర్శించారు. మాజీ మంత్రులు మహమూద్ అలీ, మల్లారెడ్డితో కలిసి ఉదయం కార్ఖానాలోని ఆమె నివాసానికి వెళ్లి లాస్యనందిత చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఆమె తల్లి, సోదరిని ఓదార్చారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో లాస్య నందిత మరణించారన్న వార్త విని షాక్‌కు గురయ్యానని చెప్పారు. విదేశాల్లో ఉండటం వల్ల ఆమె అంత్యక్రియలకు హాజరు కాలేపోయానని తెలిపారు. కవాడిగూడ కార్పొరేటర్‌గా పనిచేసిన సమయంలో లాస్య నందితను దగ్గరగా చూశానని, ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం ఎంతో ఆప్యాయంగా ఉన్న లాస్య నందిత మన మధ్య లేకపోవడం ఎంతో బాధాకరమని అన్నారు. కుటుంబం మనోధైర్యంతో నిబ్బరంతో ఉండాలని, బీఆర్ఎస్ పార్టీ అండగా నిలబడతామని భరోసా ఇచ్చారు.

కాంగ్రెస్ కార్యకర్తల దాడిలో గాయపడిన జర్నలిస్టు శంకర్‌ను పరామర్శిస్తున్న కేటీఆర్

జర్నలిస్ట్‌పై హత్యాయత్నం రేవంత్ పనే

తుర్కయాంజల్, ఫిబ్రవరి 25: జర్నలిస్ట్ శంకర్‌పై హత్యాయత్నం వెనుక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్ర ఉన్నదని, కొడంగల్‌లో రైతులకు చెందిన భూముల కబ్జాలపై నిజాలు వెల్లడించినందుకే శంకర్‌పై దాడి చేయించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. దాడిలో గాయపడిన శంకర్‌ను ఆదివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వంపై శంకర్ లేవనెత్తుతున్న ప్రశ్నలను తట్టుకోలేకనే ఆయనపై దాడికి తెగబడ్డారని అన్నారు. ఈ దారుణానికి సీఎం రేవంత్ పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. శంకర్‌ను అంతమొందించాలన్న లక్ష్యంతో పథకం ప్రకారం భౌతికదాడికి పాల్పడిన దుర్మార్గులపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేయకుండా అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని ఎండగడుతూ ప్రధాన ప్రతిపక్షంగా కార్యాచరణ చేపడుతామని హెచ్చరించారు. శంకర్‌పై దాడి విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని రాష్ట్ర డీజీపీని కోరారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నాటి ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబసభ్యుల గురించి కాంగ్రెస్, ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు అడ్డగోలుగా మాట్లాడినా తాము ఎన్నడూ భౌతికదాడులకు పాల్పడలేదని గుర్తుచేశారు. శంకర్‌తోపాటు ఆయన కుటుంబసభ్యులకు అండగా ఉంటామని కేటీఆర్ భరోసా ఇచ్చారు. కేటీఆర్ వెంట మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, గువ్వల బాలరాజ్, బాజిరెడ్డి గోవర్ధన్, రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దూదిమెట్ల బాలరాజ్, పల్లె రవికుమార్, వంగేటి లక్ష్మారెడ్డి, తుర్కయాంజల్ కౌన్సిలర్ కీర్తన తదితరులు ఉన్నారు.

మాజీ సర్పంచ్ స్పీచ్‌కు కేటీఆర్ ఫిదా

అచ్చంపేట, ఫిబ్రవరి 25: అచ్చంపేటలో జరిగిన సన్నాహక సమావేశంలో నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం వెంకటేశ్వర్లబావి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, ఆదివాసి పద్మ స్పీచ్‌కు కేటీఆర్ ఫిదా అయ్యారు. పద్మతో ఫొటో దిగి అభినందించారు. పద్మ మాట్లాడుతూ 'బీఆర్ఎస్ పార్టీ ఓడిపోలేదు. ఉద్యమం చేసి కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నాం. తెలంగాణ తెచ్చుకొని విజయం సాధించాం. కేసీఆర్ ఎప్పుడూ ప్రజల గుండెల్లోనే ఉంటారు. మనం ఓడిపోయామని ఎప్పుడూ బాధపడాల్సిన అవసరంలేదు. తెలంగాణ తెచ్చిననాడే మనం గెలిచి నిలబడ్డాం. తెలంగాణ వచ్చిన తర్వాతే గువ్వల బాలరాజు అన్న నాకు సర్పంచ్‌గా అవకాశం కల్పించారు. ఐదేండ్లపాటు ప్రజల కోసం పనిచేశాను' అని గుర్తుచేశారు.

మీడియా అకాడమీ చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా సీనియర్ జర్నలిస్ట్ కే శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. రెండేండ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) అధ్యక్షునిగా చిరపరిచితులైన శ్రీనివాస్‌రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ హయాంలో 1996లో ప్రెస్ అకాడమీని ఏర్పాటు చేసినప్పుడు తొలి చైర్మన్‌గా వ్యవహరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ప్రెస్ అకాడమీ పేరును మీడియా అకాడమీగా మార్చిన విషయం తెలిసిందే. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డి నియమితులవడం ఇది రెండోసారి. ఉమ్మడి నల్లగొండ జిల్లా పల్లెపహాడ్ గ్రామానికి చెందిన కలిమికొండ శ్రీనివాస్‌రెడ్డి సీపీఐ అనుబంధ విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ నాయకునిగా పని చేశారు. 'విశాలాంధ్ర' దిన పత్రిక స్టాఫ్ రిపోర్టర్‌గా పత్రికా రంగంలోకి ప్రవేశించి ఆ పత్రికలో ఎడిటర్ స్థాయికి ఎదిగారు. దాదాపు ఐదు దశాబ్దాల నుంచి పత్రికా రంగంలో కొనసాగుతున్న శ్రీనివాస్‌రెడ్డి జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర, జాతీయ నాయకునిగా అనేక పదవులు నిర్వహించారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షునిగా, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా, రెండు పర్యాయాలు ప్రెస్ కౌన్సిల్ ఇండియా సభ్యునిగా పని చేశారు. ప్రస్తుతం 'ప్రజాపక్షం' పత్రికకు ఎడిటర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి మరోసారి తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా నియమితులవడంపై జర్నలిస్టు సంఘాల నాయకులు, పలువురు సీనియర్ జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	17.0°c	37.0°c
రంగారెడ్డి	20.3°c	37.7°c
మెదక్	21.5°c	35.7°c
కరీంనగర్	22.0°c	32.0°c
ఖమ్మం	22.0°c	36.0°c
హైదరాబాద్	22.1°c	32.8°c
మహబూబ్‌నగర్	22.2°c	34.4°c
నిజామాబాద్	23.4°c	34.4°c
నల్లగొండ	23.5°c	34.5°c
వరంగల్	24.0°c	31.0°c

అపాయింటెడ్ డే ఎప్పుడు?

మొదటిపేజీ తరువాయి...

ఆమోదింపజేసిందని.. ప్రభుత్వం, కార్మికుల ఒత్తిడితో గవర్నర్ కూడా బిల్లుకు ఆమోదం తెలిపారని గుర్తుచేశారు. ఈ మేరకు ఆదివారం సీఎంకు హరీశ్‌రావు లేఖ రాశారు.

హరీశ్‌రావు లేఖ యథాతథంగా

కార్మికులు, ఉద్యోగుల భద్రత, సంస్థ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు వీలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి, ఆమోదింపచేసిన విషయం తెలిసిందే. గత ఏడాది చివరి అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదించిన ఆర్టీసీ విలీన బిల్లును కొన్ని వివరణలు కోరుతూ గవర్నర్ మొదట ఆమోదించలేదు. తర్వాత రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇవ్వడంతో పాటు, ఆర్టీసీ కార్మికులతో కలిసి తెచ్చిన ఒత్తిడి ఫలితంగా గవర్నర్ బిల్లును ఆమోదించిన విషయం కూడా విదితమే. శాసనసభ, గవర్నర్ ఆమోదించిన బిల్లును అమలు చేసే 'అపాయింటెడ్ డే' మాత్రమే మిగిలి ఉన్నది. ఎన్నికల కోడ్ రావడంతో మా ప్రభుత్వం విలీన నిర్ణయాన్ని అమలు చేసే 'అపాయింటెడ్ డే' నిర్వహించలేకపోయింది. ఎన్నికలు పూర్తయిన వెంటనే 'అపాయింటెడ్ డే' అమలు చేస్తామని బీఆర్ఎస్ నాడు స్పష్టం చేసింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో కూడా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే విలీన బిల్లును అమలు చేసి, ఆర్టీసీని ప్రభుత్వంలో కలుపుతామని, కార్మికులకు ప్రభుత్వమే జీతాలు చెల్లిస్తుందని ఇచ్చిన హామీని మీ దృష్టికి తెస్తున్నాను.

ఖజానా నుంచి వేతనాలు చెల్లించాలి

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర నెలలు దాటినా ఇంతవరకు ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనానికి సంబంధించిన 'అపాయింటెడ్ డే' ప్రకటించలేదనే విషయాన్ని మీ దృష్టికి తెస్తున్నాను. వాస్తవంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం ప్రారంభించిన నాడే, ఆర్టీసీ విలీన జీవో విడుదల చేస్తారని కార్మికులు, ఉద్యోగులు ఆశించారు. కానీ నేటివరకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం ప్రవేశపెట్టిన తర్వాత ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు.. ముఖ్యంగా మహిళా కండక్టర్లపై పనిభారం చాలా పెరిగింది. బస్సుల్లో ఎక్కువ మంది మహిళలు ఉండటంతో ఓవర్‌లోడ్ బస్సులు నడపలేక డ్రైవర్లు, కిక్కిరిసిన బస్సుల్లో కలియతిరుగుతూ టికెట్లు ఇవ్వడానికి కండక్టర్లు ఎంతో శ్రమించాల్సి వస్తున్నది. డ్రైవర్లు ఎక్కువ గంటలు పనిచేయాల్సి వస్తున్నది. వారి అదనపు శ్రమను దృష్టిలో పెట్టుకుని అయినా వెంటనే 'అపాయింటెడ్ డే'ని ప్రకటించి, విలీన జీవో విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను. కనీసం మార్చి నెల నుంచైనా ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వ ఖజానా నుంచి వేతనాలు చెల్లించాలని కోరుతున్నాను.

బీఆర్ఎస్ సర్కారు కొనుగోలు చేసిన బస్సులు..

బీఆర్ఎస్ ప్రభుత్వం వెయ్యి డీజిల్ బస్సులను కొనుగోలు చేయడంతో పాటు, 500 ఎలక్ట్రిక్ బస్సులను కిరాయికి తెప్పించింది. వాటిని కూడా మీరే ఇటీవల ప్రారంభించారు. పెరిగిన మహిళల రద్దీని దృష్టిలో పెట్టుకుని మరో 2000 బస్సులను అదనంగా కొనుగోలు చేయాలని కోరుతున్నాను. 2013లో జారీచేసిన పీఆర్సీ బాండ్స్‌కు పేమెంట్ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. మీరు చెప్పిన విధంగానే బాండ్స్‌కు అనుగుణంగా నగదు చెల్లింపులు చేయాలని కోరుతున్నాను. అదనపు బస్సులు సమకూర్చే విషయంలో, పీఆర్సీ బాండ్స్ చెల్లించే విషయంలో మీరే స్వయంగా చొరవ చూపగలరని మనవి అని మాజీ మంత్రి హరీశ్‌రావు సీఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

ఫుట్‌బోర్డుపై ప్రయాణికులు నిల్చొని ఉండటంతో జడ్చర్ల పట్టణంలో బస్సును నిలిపివేసిన డ్రైవర్

ఆగని 'మహాలక్ష్మి' గొడవలు

- కిక్కిరిసి వెళ్తున్న ఆర్టీసీ బస్సులు
- డ్రైవర్‌తో ప్రయాణికుల వాగ్వాదం
- ఫుట్‌బోర్డు దిగితేనే వెళ్తానన్న డ్రైవర్
- అరగంటపాటు రోడ్డుపై నిలిచిన బస్సు

జడ్చర్లటౌన్, ఫిబ్రవరి 25: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం.. ఆర్టీసీ డ్రైవర్లు, ప్రయాణికులకు సంకటంగా మారింది. నిత్యం గొడవలు జరుగుతున్నాయి. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ నుంచి కొల్లాపూర్ వైపు వెళ్తున్న హైదరాబాద్ డిపో-2 బస్సు ఆదివారం మధ్యాహ్నం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఆర్టీసీ బస్టాండ్‌లో పరిమితికి మించింది. జడ్చర్లలోని నేతాజీ చౌరస్తా వద్ద మరికొందరు ఎక్కారు. ప్రయాణికులు ఫుట్‌బోర్డుపై నిలబడటంతో బస్సు దిగాలని డ్రైవర్ సూచించాడు. వినకపోవడంతో బస్సును అక్కడే నిలిపివేసి వారు దిగితేనే ముందుకు వెళ్తానంటూ చెప్పడంతో ప్రయాణికులు, డ్రైవర్‌కు మధ్య గొడవ జరిగింది. దాదాపు అరగంట తర్వాత డ్రైవర్ మాట నెగ్గడంతో బస్సు ముందుకు కదిలింది.

రేవంత్ రాజ్యం.. పోలీసు లాఠీన్యం

మొదటిపేజీ తరువాయి...

భాగంగా ఈ నెల 23న సమ్మక్క సారలమ్మ తల్లులను దర్శించుకొనేందుకు మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి దంపతులు జాతరకు వచ్చారు. ఈ క్రమంలో స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తల్లుల దర్శనం చేసుకుంటున్నారనే నెపంతో పోలీసులు గద్దెల గేట్లను మూసివేశారు. దీంతో కొద్దిసేపు ధర్మారెడ్డి దంపతులు గద్దెల బయటనే వేచి ఉన్నారు. అనంతరం పోలీసులు గేట్లను తెరువడంతో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితోపాటు పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు 'జై తెలంగాణ' నినాదాలు చేసుకుంటూ దర్శనం చేసుకున్నారు.

హనుమకొండలో బాధితులతో కలిసి మాట్లాడుతున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, బీఆర్ఎస్ వరంగల్ అధ్యక్షుడు అరూరి రమేశ్, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

రాత్రికి రాత్రే అక్రమ అరెస్టులు

స్థానికంగా విధులు నిర్వహించే కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు 10 మంది స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు. ఘటన చోటు చేసుకున్న రెండురోజుల అనంతరం పోలీసులు ఆదివారం తెల్లవారుజామున 3-4 గంటల ప్రాంతంలో ఆత్మకూరు, దామెర మండలాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులను, బీఆర్ఎస్ నాయకులను 'ఆత్మకూరు సీఐ పిలుస్తున్నారు.. ఏదో విషయం మాట్లాడాలని' చెప్పి దామెర, ఆత్మకూరు మండలాల వైస్ ఎంపీపీలు ఎండీ జాకీర్ అలీ, రేవూరి సుధాకర్‌రెడ్డి, ఆత్మకూరు మండలం అక్కంపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కూస కుమారస్వామి, రేగుల కిశోర్, పెద్దాపూర్‌కు చెందిన వేల్పుల గణేశ్, అగ్రంపాడ్‌కు చెందిన ఆవుల శ్రీనివాస్, వంచ సాంబశివరెడ్డి, గూడెప్పాడ్‌కు చెందిన కాంతాల కేశవరెడ్డి, కాంతాల రవీందర్‌రెడ్డి, దామెర మండలం ముస్త్యాలపల్లి గ్రామ మాజీ ఎంపీటీసీ నేరెళ్ల కమలాకర్‌ను తీసుకెళ్లారు. మరో ఇద్దరిని కలుపుకొని మొత్తం 12 మందిపై ఐపీసీలోని 143, 149, 353 సెక్షన్ల కింద కేసు పెట్టారు. అవన్నీ స్థానిక ఠాణాలో బెయిల్ ఇచ్చే సెక్షన్లే కావడం గమనార్హం.

ఇందిరమ్మ పాలన అంటే ఇదేనా?: కడియం

పోలీసులు కొట్టడంతో గాయాలైన బాధితులు, బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కలిసి కడియం శ్రీహరి విలేకరులతో మాట్లాడారు. 'మనం ఎక్కడ ఉన్నాం. 30 ఏండ్ల క్రితం కూడా ఇలాంటి దుస్థితి లేదు. ఇందిరమ్మ రాజ్యం అంటే దాడులేనా?' అని ప్రశ్నించారు. వరంగల్ పోలీసు కమిషనర్‌కు 24 గంటల గడువు ఇస్తున్నామని, అన్యాయంగా కొట్టిన పోలీసులపై చర్యలు తీసుకోకపోతే తీవ్రమైన స్పందన ఉంటుందని హెచ్చరించారు. ఈనెల 27న 'ఛలో ఆత్మకూరు' నిర్వహిస్తామని తెలిపారు. హైకోర్టుకు, మానవ హక్కుల కమిషన్‌కు వెళ్తామని హెచ్చరించారు. తెలంగాణ ప్రజలు స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంటున్నారని చెప్తున్న కాంగ్రెస్ వాళ్లు రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ కార్యకర్తలపై ఇప్పటికే 2,600 కేసులను నమోదు చేశారని ధ్వజమెత్తారు. పరకాల, ఆత్మకూరు పోలీసు అధికారులు బీఆర్ఎస్ వాళ్లను ఇష్టం వచ్చినట్టు కొట్టారని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మండిపడ్డారు. ఇవి రాజకీయప్రేరిత దాడులని అభివర్ణించారు.

విచక్షణారహితంగా కొట్టారు

12 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీస్‌స్టేషన్‌కు తరలించకుండా హనుమకొండలో ఉన్న టాస్క్‌ఫోర్స్ స్టేషన్‌కు పోలీసులు తరలించారు. అక్కడా ఏసీపీ ఆధ్వర్యంలో వారిని టాస్క్‌ఫోర్స్ పోలీసుల పేరుతో బట్టలు ఊడదీసి బూతులు తిడుతూ విచక్షణారహితంగా కొట్టారు. ఈ విషయాన్ని ఎక్కడా చెప్పొదద్దని, ఎక్కడ చెప్పినా రౌడీ షీట్ ఓపెన్ చేయడంతోపాటు టాడా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం టాస్క్‌ఫోర్స్ స్టేషన్ నుంచి పరకాల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడినవారిని వరంగల్ ఎంజీఎం దవాఖానలో చేర్చి, చికిత్స అందించారు.

సమాచారం ఇవ్వలేదు: గణేశ్ కుటుంబ సభ్యులు

విషయం తెలుసుకొనేందుకు ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌కు వెళ్తే పోలీసులు సరైన సమాచారం అందివ్వలేదని బాధితుడు గణేశ్ కుటుంబ సభ్యులు వాపోయారు. అసలు శుక్రవారం గణేశ్‌తోపాటు కుటుంబ సభ్యులందరం మినీ మేడారం జాతరకు వచ్చామని, ఆ సమయంలో అక్కడకు మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వచ్చారంటే గణేశ్ మాజీ ఎమ్మెల్యేను కలిసి వస్తానని చెప్పి 10 నిమిషాల్లోనే వెళ్లివచ్చారని తెలిపారు. తీరా ఆదివారం ఉదయం 3-4 గంటల ప్రాంతంలో ఆత్మకూరు ఎస్సై వచ్చి అగ్రంపహాడ్ జాతరలో జరిగిన లొల్లి విషయమై సీఐ తీసుకురమ్మంటున్నారని చెప్పారని అన్నారు. తమకు ఆ లొల్లికి సంబంధం లేదని చెప్పినా 10 గంటల వరకు ఇంటికి రావొచ్చని చెప్పి తీసుకెళ్లారని తెలిపారు.

బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులను సహించం

బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం హెచ్చరిక

మోస్రా (చందూర్), ఫిబ్రవరి 25: బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు చేస్తే సహించేది లేదని, ఎంతకైనా తెగించి పోరాడుతామని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. ఆదివారం ఆయన నిజామాబాద్ జిల్లా మోస్రా మండల కేంద్రంలో పర్యటించారు. ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. మండల కేంద్రంలో కొనసాగుతున్న కాంప్లెక్స్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. తన రాజకీయ జీవితంలో ఎవరికీ అన్యాయం చేయలేదని తెలిపారు. కొందరు నాయకులు సొంత ప్రయోజనాల కోసం ఇతర పార్టీల వైపు వెళ్తున్నారని విమర్శించారు. తనను కడుపున పెట్టుకున్న వారందరినీ కాపాడుకుంటానని భరోసా ఇచ్చారు. అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతో ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, ఎవరైనా తమ నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి హాని తలపెట్టినా ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.

నిపుణ
విద్య, ఉద్యోగ సమాచారం

సింగరేణిలో 272 ఖాళీలు..

కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

- **మొత్తం ఖాళీలు:** 272
- **పోస్టులు:** మేనేజ్‌మెంట్ ట్రెయినీ, జూనియర్ ఎస్టేట్ ఆఫీసర్స్, జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్ తదితరాలు
- **విభాగాలు:** మైనింగ్, పర్సనల్, సివిల్ తదితరాలు
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరి తేదీ:** మార్చి 18
- **వెబ్‌సైట్:** https://scclmines.com

టీచింగ్ పోస్టులు

పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 20
- **పోస్టులు:** గ్రేడ్-1,2 అసిస్టెంట్ ప్రొఫెసర్
- **సబ్జెక్టులు:** సీఎస్ఈ, ఈసీఈ, మ్యాథమెటిక్స్
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 18
- **వెబ్‌సైట్:** www.iiitp.ac.in

ఎస్బీఐలో..

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ)లో రెగ్యులర్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 50
- **పోస్టులు:** క్రెడిట్ ఎనలిస్ట్
- **అర్హతలు:** డిగ్రీ, ఎంబీఏ ఫైనాన్స్/సీఏ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 4
- **వెబ్‌సైట్:** https://sbi.co.in

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- డీఎస్సీ స్పెషల్ జాగ్రఫీ, జూనియర్, సీనియర్ ఇంటర్ మాదిరి ప్రశ్నాపత్రం కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.